

యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, అతని అనుచరులు

నేను పిలిస్తే రావా.. చంపేస్తా నిన్ను..

ఏఎంసీను బెదిరించిన కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

నిరసనగా నేడు 19వ సర్కిల్ కార్యాలయంలో పెన్‌డౌన్ సమ్మె

సిటీ బ్యూరో/జూబ్లీహిల్స్, జూన్ 18 : 'ఏరా.. ఎంత అహంకారం నీకు..నేను పిలిస్తే రావా..చంపేస్తా నిన్ను' అంటూ రహ్మత్ నగర్ కాంగ్రెస్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి రెచ్చిపోయి యూసుఫ్‌గూడ -19 సర్కిల్ కార్యాలయంలో తన అనుచరులతో కలిసి వచ్చి వీరంగం సృష్టించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజును పరుష పదజాలంతో దూషించి దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో నేడు జీహెచ్‌ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో అధికారులు పెన్‌డౌన్ సమ్మెకు పిలుపునిచ్చారు. పోలీసులు, ఏఎంసీ బాలరాజు,ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బీఆర్ఎస్ నుంచే కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి బుధవారం ఉదయం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజ్‌కు ఫోన్‌చేసి రహ్మత్‌నగర్‌కు వెంటనే రావాలన్నారు. కార్యాలయంలో తనకు ముఖ్యమైన సమావేశం ఉందని..ముగిశాక వస్తానని అధికారి బదులిచ్చారు. దాంతో కోపోద్రిక్తుడైన కాంగ్రెస్ కార్పొరేటర్.. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్‌లోనే దూషించి..కోపం చల్లారక యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయానికి తన స్థానిక రౌడీ అనుచరులతో కలిసి వచ్చి నానా రగడ చేశారు. నేరుగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజ్ కుర్చీ వద్దకు వెళ్లి ఇష్టానుసారంగా బూతులతో విరుచుకుపడ్డారు. సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా, సహోద్యోగులు, సిబ్బంది ఎదుటే అధికారి బాలరాజ్ ను దూషించి పైపైకి వచ్చి బెదిరింపులకు గురి చేశారు. ఎంతగా నచ్చజెప్పినా వినకుండా కార్పొరేటర్ సిఎన్ రెడ్డి నానా హంగామా చేశారు. ఈ వివాదం మొత్తం సామాజి మాధ్యమాల్లో వైరల్ గా మారింది. అధికార పార్టీ కార్పొరేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేద్దామా..వద్దా అని తర్జనభర్జన పడి బుధవారం రాత్రి తన సిబ్బంది ద్వారా మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

చిక్కడపల్లి, జూన్ 18: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించి ఎన్నో త్యాగాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధా లుగా ఆదుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సాధించుకన్న తెలంగాణలో ఉద్యమకారులు ఎన్నో కష్టాలు పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరచిన అంశాలైన ఉద్యమకారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం, విద్యార్థులు, ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయాలని, అమరుల కుటుంబాలకు ఉద్యోగంతో పాటు రూ.25 వేల పెన్షన్ ఇవ్వడం కోసం వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. ఉద్యమకారులకు బస్సుల్లో, రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పించాలని, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, అరుణోదయ విమలక్క, సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ వెన్నెల గద్దర్, న్యాయవాది, సామాజిక తెలంగాణ ఫ్రంట్ అధ్యక్షుడు వెన్నపూజ పరుషరాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి.. హనీ ట్రాప్‌చేసి..

మహిళ పేరుతో ఫేస్‌బుక్‌లో చాటింగ్‌చేసి రిటైర్డ్ ఉద్యోగికి వల.. రూ.38.73లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): నగరానికి చెందిన ఓ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి(75)ని సైబర్ నేరగాళ్లు హనీ ట్రాప్‌చేసి రూ.38.73లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ సంవత్సరం మొదట్లో వృద్ధుడికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళ పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అతను యాక్సెప్ట్ చేయగా..ఆ మహిళ అతనితో చాటింగ్ చేసింది. తమ తండ్రి వదిలేశాడని, తల్లి టైలర్ అని పరిచయం చేసుకుంది. తనకు చాటింగ్ చేసేందుకు వైఫై సదుపాయం కల్పించాలని అతనికి కేబుల్ ఆపరేటర్ నంబర్ ఇచ్చింది. వెంటనే అతను.. కేబుల్ ఆపరేటర్ నంబర్‌కు ఫోన్‌చేసి రూ.10వేలు పంపాడు. ఆ తర్వాత ఆ మహిళ నుంచి ఫేస్‌బుక్‌లో ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆ విశ్రాంత ఉద్యోగి .. కేబుల్ ఆపరేటర్‌తో చాటింగ్ చేయగా ఆమె జబ్బు పడిందని చెప్పగా.. రూ.10లక్షలు పంపాడు. ఆ తర్వాత తన క్రెడిట్ కార్డు నుంచి మరో రూ.2.65 లక్షలు పంపించాడు. కొన్నిరోజుల తర్వాత ఆ మహిళ దుబాయ్ వెళ్లిపోయిందని, ఆమె కాంటాక్ట్స్ ఏమీలేవని చెప్పాడు. అయితే.. తన తల్లి, సోదరి మీతోతో మాట్లాడాలనుకుంటున్నారని కేబుల్ ఆపరేటర్ చెప్పారు. ఆ తర్వాత వారి ఫేస్‌బుక్ ఖాతాల నుంచి అతనికి రిక్వెస్ట్ రావడంతో వారితో చాటింగ్ చేశాడు. కొన్ని రోజుల తర్వాత లైంగిక పరమైన అంశాలపై చాటింగ్ చేసుకున్నారు. ఈ విషయంపై ఆ అమ్మాయి మైనర్ అంటూ ఇందులో అసభ్యకరంగా చాటింగ్‌చేసి వేధించావని పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ కేబుల్ ఆపరేటర్ అతనిని బెదిరించాడు. ఆ తర్వాత ఒకరు వాట్సప్‌లో కాల్‌చేసి తాను కానిస్టేబుల్‌నని, వారితో వెంటనే సెటిల్ చేసుకోవాలంటూ చెప్పాడు. దీంతో ఆ రిటైర్డ్ ఉద్యోగి.. బాలిక చదువు, ఆమె తల్లి డ్వాక్రా రుణం చెల్లింపు కోసం రూ. 12.5లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత కానిస్టేబుల్ ఈ విషయం ఎస్సైకి తెలిసిందని దీనిపై కేసు కాకుండా ఉండాలంటే డబ్బులు చెల్లించాలంటూ మళ్లీ రూ. లక్షలు తెప్పించుకున్నాడు. ఆ తర్వాత తన కోసం రూ.లక్ష కావాలంటూ అడుగగా పంపించాడు. మరోసారి ఫోన్ చేసిన కానిస్టేబుల్ కొత్త ఎస్సై వచ్చాడని, అతనికి విషయం తెలిసి పోక్సో కేసు పెడతానంటున్నాడంటూ చెప్పి.. రూ.10లక్షలు కావాలని డిమాండ్ చేయగా రూ.7లక్షలు పంపించాడు. ఇలా ఎస్ఐ, కానిస్టేబుల్ పేర్లతో ఫోన్‌కాల్స్ చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ విడతల వారీగా బాధితుడి నుంచి రూ.38.73లక్షలు దోచుకున్నారు. మరోసారి డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు చివరకు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన ఫేస్‌బుక్ పరిచయాలు, హనీట్రాప్‌లను సూచిస్తున్న నేపథ్యంలో రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులు ఎవరి ట్రాప్‌లో పడొద్దంటూ పోలీసులు సూచించారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో మహిళకు

రూ.2.27 లక్షల టోకరా..

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో ఓ గృహిణికి వలవేసిన సైబర్ నేరగాళ్లు.. ఆమెనుంచి రూ.2.27 లక్షలు కాజేశారు. మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన ఓ గృహిణి వాట్సప్‌కు కార్టలేన్ టాటా ప్రొడక్ట్ కంపెనీ ఆఫరింగ్ పార్ట్‌టైమ్ జాబ్స్.. మీరు చేరాలంటే ఎస్ అని టైప్ చేయండి అంటూ మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితురాలు ఎస్ అని టైప్ చేయగా మరుసటి రోజు టెలిగ్రామ్‌లో బాధితురాలి నంబర్‌ను యాడ్ చేసి, మీకు 25 అర్డర్లు ఇస్తాం, వాటిని క్లిక్ చేయండి, అవి పూర్తి కాగానే మీ బ్యాంకు ఖాతాలోకి రూ. 800 నుంచి రూ.1200 డిపాజిట్ అవుతాయంటూ నమ్మించారు. ముందుగా మీరు కార్టలేన్‌సీరిస్.కామ్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోండి అంటూ సూచించారు. ఇలా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని లింక్‌లు క్లిక్ చేయగానే మీరు రూ. 42 వేలు సంపాదించారంటూ స్క్రీన్‌పై నంబర్ కన్పించింది. తరువాత 100 శాతం క్యాష్ బ్యాక్ బోనస్‌తో కొత్తస్కీమ్‌ను ప్రవేశపెడుతున్నామని, రూ. 30 వేలు డిపాజిట్ చేస్తే అదనంగా రూ.15 వేలు సంపాదించుకునే స్కీమ్ ఇదంటూ నమ్మించారు. అది నిజమని నమ్మిన బాధితురాలు వాళ్లు చెప్పినట్లు వారం రోజుల్లో రూ. 2,57,106 డిపాజిట్ చేస్తూ వెళ్లింది. అయితే లాభంగా ఆమెకు రూ. 30 వేలు సైబర్‌నేరగాళ్లు తిరిగి పంపించారు. మొత్తం రూ. 2,27,106 మోసపోయానని గుర్తించిన బాధితురాలు బుధవారం రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నగరంలో డ్రగ్స్, గంజాయి విక్రయాలు

8 మంది అరెస్ట్.. పరారీలో ఒకరు

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): బెంగుళూరు కేంద్రంగా నగరంలో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ముగ్గురు వినియోగదారులను ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన వరాల దీక్షిత్ , కొండబోయిన వరణ్‌తేజ్‌లు బెంగుళూరు నుంచి తక్కువ ధరకు ఎండీఎంఎ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి.. నగరంలోని పరిచయస్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ అధికారులు బుధవారం అమీర్‌పేట ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తుండగా దీక్షిత్, వరుణ్‌తేజ్‌లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులతో పాటు డ్రగ్స్ కొనుగోలు చేయడానికి వచ్చిన భాషాపాగ ప్రవీణ్‌రాజ్ , ఎండీ అస్లామ్ హుస్సేన్ , సంగప్రేమ్ సాయిలను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 6.34 గ్రా ముల ఎండీఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్‌టీఎఫ్ టీమ్-బీ ఎస్ఐ బాలరాజు, సంధ్య పాల్గొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును అమీర్‌పేట్‌ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

ధూల్‌పేటలో 1.248 కేజీల గంజాయి పట్టివేత

ధూల్‌పేట బలరామ్ గల్లీలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న దుర్గేశ్‌సింగ్ , గులాబ్ సింగ్ , కాళీబాయిలను ఎస్‌టీఎఫ్ టీమ్-ఏ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 1.248 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. మరో నిందితుడైన రాజు సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

జోయాలుక్కాస్‌లో అతి పెద్ద ఆభరణాల సేల్

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఆకట్టుకునే ఆభరణాలకు నిలయమైన జోయాలుక్కాస్ షో రూం అతి పెద్ద ఆభరణాల సేల్ ను ప్రకటించింది. ఈ ఏడాది జూలై 13 వరకు అన్ని జోయాలుక్కాస్ షోరూంలలో వినియోగదారులకు గోల్డ్, కట్, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినమ్, వెండి, ప్రెషస్‌స్టోన్ జ్యువెలరీ శ్రేణిలో మజూరీ చార్జీలపై 50 శాతం తగ్గింపును ప్రకటించింది. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ ఆభరణాల కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారునికి ఆనందదాయకమైన అనుభూతిని మిగిల్చేలా సేవలందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అన్ని షోరూంలలో ఈ ఆఫర్ ప్రయోజనాలను పొందవలసిందిగా వినియోగదారులకు సూచించారు. జోయాలుక్కాస్ నుండి చేసిన ప్రతి కొనుగోలుపై వినియోగదారులు జీవితకాలం నిర్వహణ, ఏడాది ఉచిత బీమా, బై బ్యాక్ హామీ పొందుతారని తెలిపారు.

స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

స్కూల్ బస్ డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

మద్యం తాగి పట్టుబడిన ఐదుగురు డ్రైవర్లు

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): మద్యంసేవించి స్కూల్ బస్సులు నడపవద్దని, పిల్లల ప్రాణాలతో చెలగాటమాడవద్దంటూ హైదరాబాద్ ట్రాఫిక్- 1 డీసీపీ రాహుల్ హెగ్డే సూచించారు. బుధవారం వెస్ట్, నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, బేగంపేట, ఎస్ఆర్‌నగర్, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, త్రిములఘిరి, మహంకాళి, గోపాలపురం ప్రాంతాలను కలుపుకుని మొత్తం 34 ప్రదేశాల్లో స్కూల్ బస్సుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 324 బస్సులను తనిఖీ చేయగా.. అందులో ఐదు బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా గుర్తించామని రాహుల్ హెగ్డే తెలిపారు. ఈ స్పెషల్‌డ్రైవ్‌లో ట్రాఫిక్-1 అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్, నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్తుమాఫియా నాయకుడు అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): నగరంలో ఆల్ఫాజోలం మత్తు మాత్రలు విక్రయిస్తున్న ఘరానా ముఠా నాయకుడిని తెలంగాణ ఆబ్కారీ పోలీసులు ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్టు చేశారు. అంతకు ముందు నగరంలో పట్టుబడిన ముఠా సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు నగర ఆబ్కారీ పోలీసు బృందం ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లి, అక్కడ తలదాచుకున్న నిందితుడిని అరెస్టు చేసి, బుధవారం నగరానికి తీసుకువచ్చారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డెరైక్టర్ షానవాజ్ ఖాసిం కథనం ప్రకారం.... ఈనెల 4న హయత్‌నగర్‌లోని ఆటోనగర్‌లో ఆల్ఫాజోలం సరఫరా చేస్తున్న లక్ష్మన్న, మునీ శేఖర్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.27లక్షల విలువ చేసే 26.91కిలోల ఆల్ఫాజోలం మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ మత్తు మాత్రల విషయమై ఎక్సైజ్ అధికారులు నిందితులను లోతుగా విచారించగా పలు ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. ఉత్తర ప్రదేశ్‌లోని, కిద్వాయినగర్, కాన్పూర్‌కు చెందిన అజయ్ త్రిపాఠి స్థానికంగా అక్రమ పద్ధతిలో ఆల్ఫాజోలం మత్తు మాత్రలను తయారు చేసి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు నిందితులు ఆబ్కారీ అధికారుల విచారణలో వెల్లడించారు. దీంతో యూపీకి వెళ్లిన తెలంగాణ ఆబ్కారీ పోలీసులు అజయ్ త్రిపాఠిని అరెస్టు చేసి నగరానికి తరలించారు.

కన్న కొడుకే కాలయముడై..

తండ్రిని బండరాయితో మోది హత్యచేసిన కిరాతకుడు

కందుకూరు మండలం పులిమామిడిలో దారుణం

కందుకూరు, జూన్ 18: కన్నకొడుకే ఆ తండ్రి పాలిట యముడిలా మారాడు. ఎన్నిసార్లు చెప్పినా తమకున్న భూమిని అమ్మనివ్వడం లేదనే కోపంతో ఎవరూ లేని సమయంలో తండ్రి నెత్తిన బండరాయితో మోది కడతేర్చాడు. ఈ అమానవీయ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిమామిడిలో చోటుచేసుకుంది. కందుకూరు సీఐ సీతారాం వివరాల ప్రకారం.. పులిమామిడికి చెందిన పసుపుల చిన్న జంగయ్య (65) గొర్రెల కాపరి. అతడికి భార్య పద్మ, ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. జంగయ్య పేరుమీద అదే ఊరిలో 20 గుంటల భూమి ఉంది. కాగా భూమిని అమ్ముదామని గత కొంతకాలంగా జంగయ్య కొడుకు పసుపుల శేఖర్ తరచూ తల్లిదండ్రులతో గొడవ పడుతుండేవాడు. ఇటీవల తల్లిదండ్రులు కొత్త ఇంటి నిర్మాణం చేస్తుండగా.. తిరిగి శేఖర్ తన తండ్రితో గొడవపడ్డాడు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించిచినా కూడా శేఖర్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శేఖర్ తన భార్యాపిల్లలతో కలిసి వేరే ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. జంగయ్య, పద్మ నిర్మాణంలో ఉన్న ఇంటి స్లాబ్ కింద ఉంటున్నారు. మంగళవారం రాత్రి జంగయ్య, తన భార్య పద్మమ్మ, కొడుకు శేఖర్.. ముగ్గురూ కలిసి భోజనం చేసిన తర్వాత.. పద్మమ్మ అదే ఊరిలో ఉండే తన 2వ కూతురు ఇంటికి వెళ్లి పడుకుంది. చంద్రయ్య ఇంటి స్లాబ్ కింద పడుకున్నాడు. భూమి అమ్మడానికి తన తండ్రి అంగీకరించడం లేదని కోపం పెంచుకున్న శేఖర్.. స్లాబ్ కింద ఒంటరిగా నిద్రిస్తున్న తండ్రి జంగయ్య తలపై బండరాయితో మోది హత్యచేశాడు. తల్లి పద్మమ్మ ఇంటికి వచ్చి చూడగా చంద్రయ్య రక్తపు మడుగులో చనిపోయి కనిపించాడు. భూమిని అమ్మనివ్వడం లేదనే కోపంతో తన కొడుకు శేఖరే.. తన భర్తను చంపిఉంటాడని పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

హెచ్‌సీఎస్‌సీ కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, హెచ్‌సీఎస్‌సీ చైర్మన్ సీవీ ఆనంద్ తెలిపారు. బుధవారం హెచ్‌సీఎస్‌సీ సభ్యులు హైదరాబాద్‌కు చెందిన ఆభరణాల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీఎస్‌సీ కోసం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబర్‌ను +918712661555ని ప్రారంభించిన అనంతరం అత్యవసర భద్రతా సమస్యలు, కమ్యూనిటీ పోలీసింగ్ చొరవపై కౌన్సిల్‌తో సహా కరించడానికి ఈ హెల్ప్‌లైన్ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్‌మాన్‌సింగ్, హెచ్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ సి.శేఖర్‌రెడ్డి, టీజీఐసీసీసీ ఎస్పీ పుష్ప, సీఎస్ఆర్ ఫోరమ్ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాద బాధితులకు

ఆపద్బంధువు.. 112

టీజీఐసీసీసీ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): వేర్వేరు చోట్ల జరిగిన అగ్ని ప్రమాద బాధితులను డయల్-112 ఆపద్బంధువులా ఆదుకుంది. సకాలంలో సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో ప్రమాద తీవ్రతను తగ్గించడంతోపాటు అక్కడ చిక్కుకున్న బాధితులను ప్రాణాలతో క్షేమంగా కాపాడగలిగామని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.... బాచుపల్లి పోలిస్టేషన్ పరిధిలోని మిధిలానగర్, హిల్-టాప్ టవర్స్‌లో బుధవారం తెల్లవారుజామున 3.30గంటలకు భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో బాధితులు డయల్-112(తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్)కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన టీఈఆర్ఎస్ఎస్ అధికారులు బాచుపల్లి పోలీసులతో పాటు స్థానిక అగ్నిమాపక శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతోపాటు అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను సురక్షితంగా రక్షించారు. దీంతో ప్రాణ నష్టం తప్పింది.

మరో ఘటనలో కరీంనగర్, మాతృశ్రీ హోమ్‌కేర్‌లో బుధవారం తెల్లవారుజామున 3.51గంటల సమయంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో బాధితులు డయల్-112కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన టీఈఆర్ఎస్ఎస్ కరీంనగర్ టు టౌన్ పోలీసులతో పాటు స్థానిక అగ్నిమాపక సిబ్బందిని రంగంలోకి దించింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పడంతోపాటు ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను సురక్షితంగా కాపాడినట్లు టీజీఐసీసీసీ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. డయల్-112 నంబర్ కేవలం పోలీసు శాఖనే కాకుండా అగ్నిమాపక శాఖ, వైద్య, ఆరోగ్యం, మహిళలు, పిల్లల భద్రత, అన్ని రకాల ఆపత్కాల పరిస్థితుల్లో ఆదుకుంటుందని, ఈ నంబర్ దేశవ్యాప్తంగా పనిచేస్తుందని ఆయన వివరించారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పిస్తామంటూ మోసం..

నలుగురు నిందితులు అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తామంటూ ఫేక్ అలాట్‌మెంట్ లెటర్ల తో అమాయకులను మోసం చేస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నార్త్‌జోన్ బృందం, బండ్లగూడ పోలీసులతో కలిసి ఈ ఇండ్ల స్కామ్‌లో ప్రధాన నిందితులైన మహ్మద్ అహ్మద్, మహ్మద్ అమ్జద్, మీర్‌కౌసర్‌అలీ, కొత్తకోట రాజ్‌కుమార్‌రెడ్డిలను అరెస్ట్ చేశారు. బండ్లగూడలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చి.. 25 నుంచి 30 మంది నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశారు. ప్రధాన నిందితుడు మహ్మద్ అహ్మద్ ఏసీ టెక్నీషియన్‌గా, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తూ.. స్నేహితుడు అమ్జద్ అలియాస్ మునావర్‌తో కలిసి డబుల్‌బెడ్రూం పథకం కింద ప్లాట్లు అందించే ముసుగులో డబ్బులు వసూలు చేయాలని ప్లాన్ చేశారు. ఇందుకోసం వారు బండ్లగూడలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కొత్తకోట రాజ్‌కుమార్ రెడ్డి అలియాస్ రాజును సంప్రదించారు. బాధితుల నుంచి రూ.50వేల నుంచి రూ.1.7లక్షల వరకు వసూలు చేయగా.. అతని నుంచి రాజు కమీషన్ తీసుకునేవాడు.

ఆ తర్వాత గోల్కొండకు చెందిన మీర్‌కౌసర్ అలీ అలియాస్ సిరాజ్.. తన బంధువులతో కొంతమందిని కమీషన్ ఆధారంగా అహ్మద్ వద్దకు పంపించాడు. ఈ కేటాయింపు కోసం కొంత మంది దగ్గర రూ.2.22లక్షలు డిమాండ్ చేశారు. అహ్మద్.. బాధితులకు ఫేక్ అలాట్‌మెంట్ ఆర్డర్ల కాపీలు ఇచ్చారు. ఇందుకోసం వేరొకరికి కేటాయించిన ఒరిజినల్ కాపీని పిక్స్‌ఆర్ట్ యాప్‌లో సవరించి.. కేటాయింపు ఆర్డర్ల కాపీల ఖాళీ పత్రాలను తయారుచేసి, వాటిని బాధితుల పేరుతో నింపేవాడు. అంతేకాకుండా ఆ కాపీలపై ఆర్డీఓ హైదరాబాద్ సంతకాన్ని అంటించి దానిపై సీల్ వేసేవాడని పోలీసులు చెప్పారు. ఇలా బండ్లగూడ, అంబర్‌పేట, మంగళ్‌హాట్, మాదన్నపేట, గోల్కొండ, నల్లకుంట, అత్తాపూర్ లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి బాధితులను ట్రాప్ చేసి వారి నుంచి రూ.42.35లక్షలు వసూలు చేశారని డీసీపీ సుధీంద్ర తెలిపారు. నిందితుల నుంచి 11 ఫేక్ ఆర్డర్ కాపీలు, స్టాంపులు, రూ.5.5లక్షల డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు జ్ఞానదీప్, రాఘవేందర్‌రెడ్డి, బండ్లగూడ ఎస్ఐ నాగరాజ్‌రెడ్డి, కానిస్టేబుల్స్ సాగర్, ఇమ్రాన్‌లతో పాటు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసు బృందాలను డీసీపీ అభినందించారు.

ముంపు నివారణ చర్యలు చేపట్టాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సిటీబ్యూరో: లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా తక్షణ తాత్కాలిక చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎం